



హొళగుందలో మట్టి ఎద్దులకు పూజలు చేస్తున్న చిన్నారులు



- నేడు ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి భేటీ
- సీమ సాగు నీటి ప్రయోజనాలపై చర్చించాలి
- గుండ్రేవుల ప్రాజెక్టుపై చర్చలు సఫలం కావాలి
- శ్రీశైలం నీటి నిల్వలపై స్పష్టత సాధించాలి
- రాయలసీమ రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

ఏం మాట్లాడుతారో..?

కర్నూలు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమస్యలే ప్రధాన అజెండాగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలు శనివారం (నేడు) హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సమావేశం కానున్నారు. ఏపీ పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో ఉన్న సంస్థల విభజనపైనే ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. వీటితో పాటుగా రెండు రాష్ట్రాల మధ్య దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలు సీఎంల భేటీలో చర్చించే అవకాశం ఉంది. చంద్రబాబు సారథ్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తెలుగు రాష్ట్రాల మధ్య సోదరసారుప్యత సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే విభజన సమస్యలపై మాట్లాడుకుందాం..! అంటూ చంద్రబాబు లేఖ రాయడం.. అంతేసానుకూలంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందిండంతో నేటి భేటీకి మార్గం సుగమనమైంది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కాబోతుండడంతో సరిహద్దు రాయలసీమ రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. విభజన సమస్యలతో పాటుగా శ్రీశైలం నీటి నిల్వలు, వినియోగం, ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రాణాధారమైన గుండ్రేవుల జలాశయం నిర్మాణం, దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఆర్డీఎస్ ఆనకట్ట ఆధునికీకరణ.. వంటి సమస్యలపై కూడా చర్చించాలి.. ఇరు రాష్ట్రాల రైతాంగం నీటి ప్రయోజనాలు కాంక్షిస్తూ సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు.

ఇరు రాష్ట్రాల సంజీవని 'సిద్ధేశ్వరం అలుగు'

శ్రీశైలం జలాశయం ఎగువన 854 అడుల లెవల్‌లో సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని రాయలసీమ కరువు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అలుగు నిర్మాణం రెండు తెలుగు రాష్ట్రాలకు సంజీవని లాంటింది. జలాశయంలో చేరే పూడికను నివారించడం, రాయలసీమ, తెలంగాణ ప్రాజెక్టులకు సాగునీటి నిర్వహణ, ఇరు రాష్ట్రాలకు భవిష్యత్తుకు సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం ఎంతో అవసరం. ఈ ప్రాజెక్టుపై దశాబ్దాలుగా రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఇరు రాష్ట్రాలకు జల సంజీవని లాంటి ఈ అలుగు నిర్మాణంపై కూడా సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు చర్చించాలి. సఫలీకృతమయ్యేలా నిర్ణయాలు తీసుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, రైతులు ఆకాంక్షిస్తున్నారు.

శ్రీశైలం కనీసం నీటి మట్టంపై చర్చించాలి

రాయలసీమ జిల్లాల జీవనాధారం శ్రీశైలం ప్రాజెక్టు. గరిష్ట నీటి మట్టం 885 అడుగులు.. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215.810 టీఎంసీలు. తెలుగు రాష్ట్రాలకు ప్రాణాధారం. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు సహా నెల్లూరు జిల్లాలకు వరద జలాలు మళ్లించి తాగు, సాగునీరు అందించే లక్ష్యంగా తెలుగుగంగ ప్రాజెక్టు, గాలేరు-నగరి ప్రాజెక్టు, హంద్రీనీవా ప్రాజెక్టులు చేపట్టారు. కనీస నీటి మట్టం 854 అడుగులకు తగ్గకుండా క్యారీ ఓవర్ కింద 60 టీఎంసీలు నిల్వ ఉంచాలని జస్టిస్ బచావత్ అవార్డు (కేడబ్ల్యూడీటీ-1) స్పష్టంగా చెబుతుందని రాయలసీమ సాగునీటి నిపుణులు చెబుతున్నారు. ఇందుకు విరుద్ధంగా ఏటేటా డెడ్ స్టోరేజీ కంటే దిగువకు నీటిని వదిలేసి జలాశయం ఖాళీ చేయడం సీమ రైతులు ఆందోళన వ్యక్తం అవుతుంది. శ్రీశైలం కనీస నీటి మట్టం 854 అడుగులుగా కొనసాగించాలని 'రూల్ కర్వ్ ముసాయిదా'లో ఉందని కేఆర్ఎంబీ చెబుతోంది. జస్టిస్ బచావత్ (కేడబ్ల్యూడీటీ-1) అవార్డు, టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) పత్రాలు, తమిళనాడు రాజధాని చెన్నైకి తాగునీటి సరఫరా కోసం జరిగిన ఒప్పందాలను పరిగణలోకి తీసుకొని రూల్ కర్వ్ రూపొందించామని కేఆర్ఎంబీ చెబుతుంది. అంశంపై రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ) సమావేశాల్లో చర్చించకుండా తెలంగాణ అభ్యంతరం చెబుతోంది. ఆర్ఎంసీ సమావేశాలకే రావడం లేదు. ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్ -89ఏలో ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీలు కృష్ణా జలాలు ప్రాజెక్టుల వారీగా ఏపీ ప్రాజెక్టులకు 512 టీఎంసీలు, తెలంగాణ ప్రాజెక్టులకు 299 టీఎంసీలు కేటాయించాలని స్పష్టంగా పొందుపరిచారు. 2015లో డిల్లీలో జరిగిన అప్పటి రెండు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, కేసీఆర్‌లు దీనికి ఆమోదం తెలుపుతూ సంతకాలు కూడా చేశారు. ఆ తరువాత సగభాగం వాటా రావాలంటూ తెలంగాణ రాష్ట్ర పేచి పెట్టింది. వీటిపై కూడా తాజా చర్చల్లో ఇరు రాష్ట్రాల సాగునీటి ప్రాజెక్టు పరిధిలో రైతులకు నీటి ప్రయోజనాలకు భద్రత కల్పించాల నిర్ణయం తీసుకోవాలని సీమ ప్రజలు కోరుతున్నారు.

కరువు రైతు ప్రాణాధారం 'గుండ్రేవుల'

కర్నూలు మండలం సుంకేసుల డ్యాం ఎగువన సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామం సమీపంలో తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మించాలనే ప్రతిపాదన. ఈ రిజర్వాయర్ నిర్మాణం చేస్తే కర్నూలు-కడప (కేసీ) కాలువ పరిధిలోని 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు సాగునీరు, 6.50 లక్షలు జనాబా కలిగిన కర్నూలు నగర ప్రజలు, డ్యాం ఎగువన కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల్లో కరువు పల్లెసీమలకు సాగు, 8.50 లక్షలకు పైగా జానాభాకు తాగునీరు ఇవ్వవచ్చు. తెలంగాణలో రాష్ట్రంలో ఆర్డీఎస్ యడమ కాలువ కింద ఆయకట్టుకు 5 టీఎంసీలు సాగునీరు ఇవ్వవచ్చు. సీమ రైతుకు గుండెలాంటి ఈ ప్రాజెక్టుకు రిటైర్డ్ ఇంజనీరు సుబ్బరాయుడు రూకకల్పన చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వే, డీపీఆర్ తయారీ కోసం రూ.54.95 లక్షల మంజూరు చేస్తూ 2013 నవంబరు 1న జీవో ఎంఎస్ నంబరు.100 జారీ చేశారు. సర్వే చేసిన ఆర్వే అసోషియేట్ సంస్థ సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేసింది. రూ.2,890 కోట్లు నిధులు కావాలని రాష్ట్ర విభజన తరువాత ఏపీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. 2019 ఫిబ్రవరి 21న అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం రూ.2,890 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీఓ నం.154 జారీ చేసింది. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం గుండ్రేవుల ప్రాజెక్టును గాలికొదిలేసింది. ప్రస్తుతం నిర్మాణం వ్యయం రూ.5,500 కోట్లు నుంచి రూ.6 వేల కోట్లకు చేరింది.

ఆర్డీఎస్ పరిష్కారమయ్యేనా?

తుంగభద్ర నదిపై కర్నూలు జిల్లా కోసిగి మండలం అగసనూరు, కర్ణాటకలోని రాజోలిబండ గ్రామాల మధ్య 1949-55 మధ్య రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) ఆనకట్ట నిర్మించారు. ఎడమ వైపున ఆర్డీఎస్ కాలువ నిర్మించారు. ఈ కాలువ 0-45 కి.మీలు వరకు కర్ణాటక పరిధిలో, 45 కి.మీలు నుంచి తెలంగాణ రాష్ట్రంలో ప్రవహిస్తుంది. ఆనకట్ట నిర్మాణంలో భాగంగా కట్ట దిగువన 19 హ్యామ్ పైప్స్ ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల క్రితం వరకు తుంగభద్రకు నిత్యం వరదలు ఉంటుండడం వల్ల వీటి వల్ల సమస్య తలెత్తలేదు. ఆర్డీఎస్ ఎగువన పూడిక చేరడంతో తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల (మహబూబ్ నగర్) జిల్లా రైతులకు సాగునీరు అందడం లేదని, ఆనకట్ట దిగువన ఉన్న హ్యామ్ పైపులు మూసివేయాలని 2003లో తెలంగాణ రైతులు ఆనకట్టను ముట్టడించడం. కర్నూలు రైతులు అడ్డుకోవడంతో జల యుద్ధమే జరిగింది. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యాక ఆ పైపులు మూసి వేయించారు. 2005 జూలై 5న ఆర్డీఎస్ మోడ్రనైజేషన్ కోసం రూ.58.94 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీవో ఎంఎస్ నంబరు.155 జారీ చేశారు. ఆధునికీకరణలో భాగంగా ఆనకట్టపై 20 ఎంఎం ఆంకర్ రాడ్స్ డ్రిల్లింగ్ చేసి ఏర్పాటు చేయడం, దానిపై ఆర్‌సీసీ కవరింగ్ చేయడం వల్ల ఆనకట్ట ఎత్తు 1090 నుంచి 1090.50 అడుగులు అంటే.. 0.50 అడుగులు (15 సెం.మీ) పెరుగుతుంది. ఈ పనులను 2016 మే16న కర్ణాటక ఇంజనీర్లు చేపడితే రైతులు అడ్డుకున్నారు. రెండు దశాబ్దాలుగా వివాదం నడుస్తుంది. గుండ్రేవుల జలాశయం నిర్మాణం చేపడితే ఆర్డీఎస్ వివాదం ఉండదని రాయలసీమ సాగునీటి నిపుణులు అంటున్నారు.



ఆర్డీఎస్ ఆనకట్ట

గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణంలో కర్నూలు జిల్లాలో 8 గ్రామాలు పూర్తిగా, నాలుగు గ్రామాలు పాక్షికంగా, 6,166.15 ఎకరాలు (ఇందులో 4,445.74 ఎకరాలు ప్రైవేలు భూమి) ముంపునకు గురవుతుంది. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లాలో మూడు గ్రామాలు పూర్తిగా, రెండు గ్రామాలు పాక్షికంగా, 3,003.24 ఎకరాలు ముంపునకు గురవుతాయి. కృష్ణా నదీ యాజ మాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ద్వారా సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తెలంగాణ ప్రభుత్వానికి గతంలోనే పంపారు.

మట్టి ఎద్దుల పండుగ



కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌లో కలశాలతో మట్టి ఎద్దులను ఊరేగిస్తున్న చిన్నారులు

హొళగుంద/కోసిగి, జూలై 5: మట్టెద్దుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇంటికి తీసుకువెళ్లి ప్రత్యేక నైవేద్యాలు పెట్టి పూజలు చేశారు. సాయంత్రం వాటికి ముస్తాబు చేసి, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఇలా చేస్తే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రైతన్నల నమ్మకం. కోసిగి మండల కేంద్రంలోని 3వ వార్డులో మట్టి ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. డప్పు వాయిద్యాల మధ్య కలశాలతో ఆంజనేయస్వామి దేవాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ పూజలు నిర్వహించారు. మట్టి ఎద్దులను పూజిస్తే పంటలు బాగా పండుతాయని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, రైతులు ఆయురారోగ్యాలతో ఉంటారని నమ్మకం. కర్ణాటక రాష్ట్రం నుంచి ఈ పండుగ సంక్రమించినట్లు పెద్దలు చెబుతారు. మట్టి ఎద్దులను ఇళ్లకు తీసుకెళ్లి ఇళ్లలో దూలాలు, పైకప్పులపై ఏడాదంతా ఉంచుతారు. కొందరు నదుల్లో నిమజ్జనం చేస్తారు.

ఈ అన్నం మాకొద్దు...

సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థుల నిరసన

కర్నూలు(కలెక్టరేట్), జూలై 5: 'పురుగులు పడ్డ ఈ అన్నం ఎలా తినేది.. మాకొద్దు' అంటూ సిల్వర్‌జూబ్లీ కళాశాల విద్యార్థులు రోడ్డెక్కారు. కళాశాలలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదంటూ సిల్వర్‌జూబ్లీ కళాశాల హాస్టల్ విద్యార్థులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ 4 సంవత్సరాల నుంచి సిల్వర్ జూబ్లీ కళాశాల వసతి గృహంలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కూడా లేవన్నారు. సమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వసతి గృహంలో పురుగులు, బొద్దింకలు పడిన భోజనం ప్లేట్లను చూపించారు. కుళ్లిపోయిన కూరగాయలను వంటల్లో ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. హాస్టల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు.



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు







భయపెడుతున్న జునోసిస్

- జంతువుల నుంచి మనుషులకు సంక్రమణ
- అప్రమత్తంగా లేకుంటే ప్రాణాంతకమే..!
- నేడు ప్రపంచ జునోసిస్ డే..
- జిల్లాలో 23870 దోసుల యాంటీ రేబీస్ టీకాలు



నంద్యాల టౌన్, జూలై 5 :

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జునోసిస్ వ్యాధులు భయపెడుతున్నాయి. జంతువుల ద్వారా వివిధ రకాల వైరస్‌ల వల్ల వ్యాప్తి చెందే జునోసిస్ వ్యాధులను అరికట్టే ప్రయత్నంలో ప్రభుత్వం వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో జంతువుల పెంపకం ఇళ్లలో సర్వసాధారణంగా మారింది. పెంపుడు జంతువుల ఆరోగ్య విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ఆ జంతువులకు ఉండే వ్యాధుల వైరస్‌లు మనిషికి సంక్రమించి ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ కుక్క కాటు బారిన పడిన ఒక బాలుడికి టీకా మందు ఇచ్చి బతికించిన రోజు (1885 జూలై 6) కావడం వల్ల జూలై 6వ తేదీన ప్రపంచ జునోసిస్ దినంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

అవగాహన, అప్రమత్తత ముఖ్యం

మూగ జీవాల పెంపకంలో అవగాహనతోపాటు అప్రమత్తత ఎంతో అవసరం. ఇళ్లలో పెంచుకునే కుక్కల వల్ల రేబిస్ వ్యాధి సంక్రమిస్తుంది. ఇదే కాకుండా గజ్జి, గడ్డి తినే జంతువుల నుంచి ఆంత్రాక్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు మనుషులకు సోకుతాయి. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులే జునోసిస్ డీసీజెస్ వ్యాధులుగా, 180 రకాలకు పైగా పశుపక్షాదులు, జంతువుల నుంచి మనుషులకు సంక్రమిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ వెల్లడిస్తోంది. జంతువులు, పశుపక్షాదులతో నిత్యం దగ్గరగా ఉండే రైతులు, వధ శాలల కార్మికులు, పశువైద్యులతోపాటు పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండే వారు జునోసిస్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీరికి ప్రధానంగా రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసుల్లోసిస్, క్షయ, తదితర వ్యాధులు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇందులో ప్రధానంగా రేబీస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి అని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.గోవిందనాయక్ పేర్కొన్నారు. జునోసిస్ వ్యాధుల పట్ల పశువుల పెంపకందారులు, రైతులు, ప్రజలు అవగాహన పెంచుకొని తగిన నివారణ చర్యలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సి ఉంది.

యాంటీ రేబీస్ టీకాల డోస్‌ల పంపిణీకి ఏర్పాట్లు



ప్రపంచ జునోసిస్ దినంగా సందర్భంగా నంద్యాల జిల్లాలో ఈ నెల 6వ తేదీన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. గోవిందనాయుడు తెలిపారు. జిల్లాలోని అన్ని పశు వైద్యశాలలు, ప్రాంతీయ పశువైద్య శాలల్లో ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 23870 డోసులు యాంటీ రేబీస్ టీకాలు సిద్ధంగా ఉంచామని, వివరాలకు టోల్ ఫ్రీ నంబరు 1962 లేదా దగ్గరలోని పశు వైద్యశాలలో గానీ, సమీప రైతు సేవా కేంద్రంలో గానీ పశువుల పెంపకందారులు, రైతులు, ప్రజలు సంప్రదించాలని కోరారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

- రూ.32 లక్షల విత్తనాలు సీజ్



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 5: ఆదోని పట్టణంలోని ఎరువులు విత్తన దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్‌లపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేపట్టారు. దాడుల్లో పలు దుకాణాల్లోని రసాయనిక ఎరువులు, పత్తి విత్తనాలు ఉన్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఏడీఏ హనుమంతరావు తెలిపారు. శ్రీభీమేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో స్టాక్‌బుక్, ఈ-పాస్ మిషన్‌లో పొందుపరిచిన రసాయనిక ఎరువుల నిలువలకు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ.5,88,520లు, 31,941 రసాయనిక ఎరువులను, రూ.2,46,240 విలువ గల బీటీ పత్తి విత్తనాలను, గీత హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో రూ.1,07,700ల కూరగాయ విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. నవత ట్రాన్స్‌పోర్ట్, ఎస్ఆర్ఎంటీ ట్రాన్స్‌పోర్ట్‌లో తనిఖీ చేసి అనుమానాస్పదంగా ఉన్న విత్తనాల, ఎరువుల సరఫరా రికార్డులను పరిశీలించారు. ఈ దాడుల్లో ఏడీఏ అరుణకుమారి, ఏవో అశోక్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'లా' ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), జూలై 5: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన లా పరీక్షల్లో 3, 5 సంవత్సరాలకు సంబంధించి 2,4,6,8,10 సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం విడుదల చేసింది. రెగ్యులర్ విభాగంలో 4, 6, 8 సెమిస్టర్లలో 3వ సంవత్సరం 4 సెమిస్టర్లో 199కి 172, 6వ సెమిస్టర్లో 238కి 229 మంది, 5వ సంవత్సరం 4వ సెమిస్టర్లో 39కి 16, 6వ సెమిస్టర్లో 30కి 24, 8వ సెమిస్టర్లో 44కు 35మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ విభాగంలో 2, 4, 6, 8, 10 సెమిస్టర్లలో 3వ సంవత్సరం 2వ సెమిస్టర్లో 23కు 13, 4వ సెమిస్టర్లో 45కు13, 6వ సెమిస్టర్లో 12కు 10 మంది, 5వ సంవత్సరం 2వ సెమిస్టర్లో 11కు మొదటి, 4వ సెమిస్టర్లో 15కు 3, 6వ సెమిస్టర్లో 5కు2, 8వ సెమిస్టర్లో4కు 1, 10వ సెమిస్టర్లో 4కు ఇద్దరు చొప్పున ఉత్తీర్ణత సాధించారు.

రైలు కింద పడి మహిళ మృతి

మంత్రాలయం, జూలై 5: మండలంలోని తుంగభద్ర (మంత్రాలయం రోడ్డు) రైల్వే స్టేషన్ సమీపంలో తుంగభద్ర నది బ్రిడ్జిపై దాదాపు 40 ఏళ్ల మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం తుంగభద్ర నుంచి రాయచూరు వెళ్తున్న గూడ్స్‌రైలుకు నది బ్రిడ్జిపై ఎదురుగా రావడంతో ఢీకొట్టింది. దీంతో మృతదేహం నుజ్జునుజ్జయింది. మహిళ ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతిగా రాయచూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచూరు ఆసుపత్రికి తరలించారు.

త్వరలో విజయవాడ నుంచి కర్నూలుకు విమాన సర్వీసులు

కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్



కేంద్ర మంత్రిని కలిసిన టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జూలై 5: విజయవాడ నుంచి కర్నూలుకు త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని కలిశారు. ఈ సందర్భంగా విజయవాడ నుంచి కర్నూలు ఎయిర్ పోర్టుకు విమాన సౌకర్యం కల్పించాలని, ముఖ్యంగా రాత్రి సమయాన ఫ్లైట్ ల్యాండింగ్ కోసం తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. విమాన సర్వీసులు ప్రారంభిస్తామని, ఏడాదిలోపు రాత్రిపూట ల్యాండ్ అయ్యేందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయిస్తామని చెప్పారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

మద్దికెర, జూలై 5: అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగా మద్దికెర, చిప్పగిరి, హొళగుంద గ్రామాలను కేంద్ర ప్రభుత్వం సంపూర్ణత అభియాన్ కింద ఎంపిక చేసిందని అన్నారు. ఈ మండలాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని, ఇచ్చిన లక్ష్యాన్ని అధికమించాలని అధికారులను ఆదేశించారు. ఈ మండలాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఆశా వర్కర్లు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వ్యవసాయ శాఖ, ప్రభుత్వ వైద్యశాల, హార్టికల్చర్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నీతి అయోగ్ కోఆర్డినేటర్ స్మృతి సబర్వాల్, అడిషినల్ డీఎంహెచ్‌వో భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఆర్డీవో రామలక్ష్మి, ఎంపీడీవో అలివేలమ్మ, ఎంపీపీ అనితా యాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని, జడ్పీటీసీ సభ్యులు డి.మురళిధర్ రెడ్డి, తహసీల్దార్ రజాక్‌వలి, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి రెడ్డి, మాజీ జడ్పీటీసీలు పి.పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, టీడీపీ నాయకులు గూడూరు ధనుంజయుడు, చంద్రశేఖర్ గౌడు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒడిస్సా యువకుడి మృతి

మంత్రాలయం, జూలై 5: విద్యుదాఘాతానికి గురై ఒడిస్సా యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. మంత్రాలయం ఎస్ఐ గోపీనాథ్ వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన బోరు వేసే యంత్రం వ్యవసాయ బోర్లు వేసేందుకు సూగూరు గ్రామానికి వచ్చింది. దినసరి కూలీగా పని చేస్తున్న మంతిరి గోండా పొలాలకు వెళ్లే దారిలో కట్టెతో విద్యుత్ వైర్లను పైకెత్తే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది సొంతూరు ఒడిస్సా రాష్ట్రం రాయ్‌ఘర్ మండలం గంజపార గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. లారీ డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు కూలీలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాలయం మఠానికి రూ.3.51 లక్షల విరాళం

మంత్రాలయం, జూలై 5: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి ముంబాయికు చెందిన రాఘవకృష్ణన్ దైనందిక సేవకు రూ.లక్ష, పాట్నాకు చెందిన అరుణ బసవరాజులనే భక్తురాలు రూ.2,51,100 విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.3,51,100 నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతలకు పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

8వ తేదీ నుంచి ఉచితంగా ఇసుక

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, జూలై 5: ఇళ్ల నిర్మించుకునే వారికి ఈ నెల 8 నుంచి ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రాలయం టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ నివాసంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఇసుక మాఫియాతో దోచుకుందని అన్నారు. ప్రస్తుతం ఇసుక రవాణా చేయకూడదన్న ఆదేశాలు ఉన్నప్పటికీ గ్రీన్‌కో కంపెనీ ద్వారా లారీలతో 250 కి.మీ. దూరంలో ఉన్న గోరుకల్లు ప్రాజెక్టుకు అధికారులు, కాంట్రాక్టర్లు యథేచ్ఛగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వానికి దోచి పెట్టిన మైనింగ్ అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సంక్షేమం కోసం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని చెప్పారు. సమావేశంలో మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, మాధవరం కృష్ణమోహన్ రెడ్డి, విజయరామిరెడ్డి, మైనార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్, నవకోటి నారాయణ, పైబావి నర్సిరెడ్డి, యేబు, నరసింహులు, సుంకప్ప, తిక్కస్వామి గౌడు, రామక్రిష్ణ, నాగరాజు, గురురాజు తదితరులు పాల్గొన్నారు.

- రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి శుక్రవారం ఉదయం మంత్రాలయం వచ్చారు. ఈయనకు ఆలయ మహా ముఖద్వారం వద్ద జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, బిందుమాధవ్‌లు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

గిరిజన మహిళపై వైసీపీ నాయకుల దాష్టీకం

నంద్యాల (నూనెపల్లె), జూలై 5: గిరిజన మహిళపై వైసీపీకి చెందిన నాయకులు దాష్టీకానికి పాల్పడ్డారు. తమ స్థలంలో లీజుకు తీసుకుని మహిళ హోటల్ నిర్వహిస్తుండగా రెంట్‌కు సంబంధించిన లావాదేవిల వ్యవహారంలో మహిళపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడిన ఘటన నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ చాబోలు మెట్ట వద్ద చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. పాణ్యంకు చెందిన గిరిజన మహిళ మంజుబాయి నంద్యాల మండలం చాబోలు మెట్ట వద్ద అదే గ్రామానికి చెందిన నరసింహారెడ్డి పురుషోత్తంలకు చెందిన కొంత స్థలాన్ని హోటల్ నిర్వహణకు తీసుకున్నారు. కొన్ని నెలల నుంచి రెంట్ బకాయిలు ఉండటంతో చెల్లించాలని స్థల యజమానులు ఒత్తిడి తెచ్చారు. తాను హోటల్‌పై రూ.12 లక్షల వరకు ఖర్చు చేశానని వాటిని చెల్లించాలని నిర్వాహకులు అనడంతో ఇద్దరి మధ్య మూడు వారాల క్రితం ఘర్షణ జరిగింది. మంజుబాయిపై నరసింహారెడ్డి, మరి కొంత మంది దాడికి పాల్పడి అప్పట్లో తీవ్రంగా గాయపరిచారు. తాలూకా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు కేసు నమోదు చేయలేదు. అయితే రెంట్ బకాయిలు చెల్లించాలని ఒత్తిడి తీసుకు రావడంతో పలుమార్లు ఇరువురు ఘర్షణలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఇరు వర్గాలకు తాలూకా అర్బన్ సీఐ దస్తగిరి 45 నోటీసులు జారి చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. ఇదే ఘటనపై విషయంపై శుక్రవారం మళ్ళీ ఘర్షణ చోటు చేసుకోవడం చాబోలుకు చెందిన పురుషోత్తం రెడ్డి, మరి కొంత మంది మంజుబాయిపై దాడికి పాల్పడి గాయపరిచారు. దీంతో బాధితురాలు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని పోలీసులను ఆశ్రయించింది. ఈ దాడిపై తాలూకా సీఐని వివరణ కోరగా దాడిపై బాధితురాలు ఫిర్యాదు చేసిందని విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

శిరివెళ్ల, జూలై 5: మండలంలోని వెంకటాపురం గ్రామ పంట పొలాల్లో విద్యుదాఘాతానికి గురై శిరివెళ్లకు చెందిన షేక్.జాకిర్‌హుసేన్ (35) అనే యువకుడు మృతి చెందాడు. విద్యుత్ స్తంభం ఎక్కి జంపర్లు సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. జాకిర్‌హుసేన్ శిరివెళ్లలోని విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో బిల్ లీడర్‌గా కొన్నేళ్ల నుంచి పని చేస్తున్నాడు. విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తున్న సమయంలో విద్యుత్ ఎలా వచ్చిందో, ప్రమాదం ఎలా చోటు చేసుకుందో అధికారుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. సంఘటనా స్థలాన్ని శిరివెళ్ల ఎస్ఐ, విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించారు. ఈ విషయంపై ఎస్ఐ సురేష్‌ను వివరణ కోరగా మృతుడి కుటుంబ సభ్యులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సైట్ ఇంజనీర్ బదిలీ వివాదాస్పదం

- డోన్ నుంచి కర్నూలుకు మార్పు
- ఎస్ఈకి తెలియకుండానే చేయడంపై విమర్శలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 5: గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్)లో ఓ సైట్ ఇంజనీర్ బదిలీ వివాదాస్పదంగా మారింది. డోన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న సైట్ ఇంజనీర్ రవికుమార్‌ను కర్నూలు క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌కు బదిలీ చేయడంపై చర్చ మొదలైంది. అవసరం లేకుండా ఎలా బదిలీ చేస్తారంటూ కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు డోన్‌లో పని చేస్తున్న సమయంలో సైట్ ఇంజనీర్‌పై వివిధ రకాల ఆరోపణలు వచ్చాయి. వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ బిల్లులు మంజూరు చేసేవారని అప్పట్లోనే కొందరు అధికారులు ఇంజనీర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసేవారు. ప్రస్తుతం డోన్ సబ్ డివిజన్ నంద్యాల జిల్లాకు వస్తుంది. అయితే నంద్యాల సూపరింటెండెంట్ ఇంజనీర్ మనోహర్‌కు తెలియకుండానే ఈ బదిలీ జరిగిందని కొందరు చర్చించుకుంటున్నారు.

ఇద్దరు అధికారుల మధ్య వాగ్వివాదం..

తనకు తెలియకుండా సైట్ ఇంజనీర్‌ను ఎలా బదిలీ చేస్తారంటూ నంద్యాల ఎస్ఈ కర్నూలులోని ఓ అధికారిని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే ఎస్ఈ చొరవతో చేసుకున్నానని ఆ అధికారి సమాధానం ఇచ్చారని తెలిసింది. నంద్యాల జిల్లా నుంచి కర్నూలుకు బదిలీపై వెళ్లాలంటే తన అనుమతి తీసుకోవాలన్న విషయం కూడా తెలియదా అని ఎస్ఈ ఇంకో అధికారితో వాదించారని, అదంతా తనకు తెలియదని ఏదైనా ఉంటే కర్నూలు ఎస్ఈతో మాట్లాడుకోవాలని సదరు కర్నూలు అధికారి సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

సైట్ ఇంజనీర్‌పై మొదటి నుంచి ఆరోపణలే..

సైట్ ఇంజనీర్‌పై మొదటి నుంచి ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ఈ ఐదేళ్ల వైసీపీ కండువా వేసుకుని విధులు నిర్వహించారని అప్పట్లోనే అధికారులు, సిబ్బంది విమర్శించారు. అంతేగాకుండా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డికి అనుకూలంగా ఉన్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అక్కడ టీడీపీ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అనుచరులు ఆ ఇంజనీర్‌ను ఇబ్బందులకు గురిచేస్తారేమోనన్న భయంతో బదిలీ చేసినట్లు తెలిసింది. కర్నూలు క్వాలిటీ కంట్రోల్ డివిజన్ డీఈగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌రెడ్డి డోన్ సబ్‌డివిజన్ డీఈగా విధులు నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి ఆదేశాలతోనే రవికుమార్‌ను కర్నూలుకు బదిలీ చేసినట్లు బలమైన నిజాలు వినిపిస్తున్నాయి.

నా దృష్టికి రాకుండానే బదిలీ చేశారు

సైట్ ఇంజనీర్ బదిలీ విషయం అస్సలు తెలియదు. నాకు తెలియకుండానే బదిలీ చేశారు. ముఖ్యంగా నా అనుమతితోనే ఇతర జిల్లాకు బదిలీ చేయాలి. అలాంటిదేమి ఇక్కడ పాటించలేదు. ఇష్టానుసారంగా బదిలీ చేసుకున్నారు.

-మనోహర్, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్, నంద్యాల జిల్లా

ఆరోగ్య కారణాలతో బదిలీ చేశాం

సైట్ ఇంజనీర్ రవికుమార్‌కు ఆరోగ్య సమస్యలు ఉన్న కారణంగానే కర్నూలు క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ చేశాం. సైట్ ఇంజనీర్లకు సంబంధించి రెండు జిల్లాలకు కర్నూలు ఎస్ఈనే బదిలీ చేయాల్సి ఉంది. నంద్యాల ఎస్ఈ రెకమెండ్ చేయలేదు. అయితే డోన్ సబ్‌డివిజన్ డీఈ రెకమెండ్ చేయడంతోనే బదిలీ చేశాను.

-నాగేశ్వరరావు, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్, కర్నూలు జిల్లా

బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం.. కర్నూలు ఆసుపత్రికి తరలింపు

కోసిగి, జూలై 5: బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం తుంబలపల్లి గ్రామానికి చెందిన సిద్దు ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం బైక్‌పై బయలుదేరాడు. సాతనూరు గ్రామానికి చెందిన హరి, వీరేంద్రలు ఉరుకుందలో స్వామివారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. కోసిగికి 3 కి.మీ. సమీపంలో వీరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. సాతనూరు గ్రామానికి చెందిన వీరేంద్ర, హరి ఇద్దరికి కాళ్ల విరిగిపోయాయి. సిద్దును ప్రైవేటు వాహనంలో మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించగా.. వీరేంద్ర, హరిని 108 వాహనంలో ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. అక్కడ వారి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో మొదలైన మట్టి భూసార పరీక్షలు

లక్ష్యం 37,500 భూసార పరీక్షలు

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 5: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మట్టి భూసార పరీక్షలు పడకేశాయి. గత వైసీపీ ప్రభుత్వం రైతుల పొలాల్లో భూసార పరీక్షలు చేసేందుకు ఎటువంటి నిధులు ఇవ్వకపోవడంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించకపోవడంతో మట్టి పరీక్షలు చేయలేని పరిస్థితి నెలకొంది. రైతుభరోసా కేంద్రాల్లో మట్టి భూసార పరీక్షలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఎటువంటి పనిముట్లు లేకపోవడం వల్ల వాటిల్లో పని చేస్తున్న సిబ్బంది మట్టి పరీక్షలు చేయలేకపోయారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై భూసార పరీక్షలు చేయాలని ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రెండు జిల్లాలో 37,500 భూసార పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. కర్నూలు జిల్లాలో 19,500, నంద్యాల జిల్లాలో 18వేలు భూసార మట్టి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆర్‌బీకేల్లో పని చేస్తున్న సిబ్బంది రైతుల పొలాలకు వెళ్లి మట్టి నమూనాలను తీసి ప్రయోగశాలలకు పంపాలని కర్నూలు జిల్లాకు సంబంధించి మట్టి నమూనాలను ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రానికి, అదేవిధంగా నంద్యాల జిల్లాకు సంబంధించి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో భూసార పరీక్ష కేంద్రానికి పంపాలని జిల్లా వ్యవసాయాధికారులు ఆర్‌బీకే కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో 466 రైతు సేవా కేంద్రాలు ఉండగా. ఒక్కో కేంద్రం నుంచి 42 మట్టి నమూనాలు సేకరించాలని, అదేం శంగా నంద్యాల జిల్లాలో 411 రైతుసేవా కేంద్రాలు ఉండగా.. ఒక్కో వ్యవసాయ సలహా మండలి నుంచి 44 మట్టి నమూనాలు వెంటనే సేకరించి ఆయా ప్రయోగ కేంద్రాలకు పంపాలని నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

పేదల భూములకు పట్టాలివ్వాలి



దూపాడులో పేదలు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలిస్తున్న సీఐటీయూ, రైతుసంఘం నాయకులు

కల్లూరు, జూలై 5: కల్లూరు మండలం దూపాడు సర్వే నెంబరు 139లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ సీఐటీయూ మండల కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ, రైతుసంఘం నాయకుల బృందం దూపాడులో పర్యటించి పేదలు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించింది. కార్యక్రమంలో హరిబాబు, చంద్రశేఖర్, లక్ష్మీదేవి, భూదేవి, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 5: జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు దర ఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ నెల 16 నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఎంపికైన అభ్యర్థు లకు అవార్డుల ప్రదానం చేస్తారని వివరించారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్), జూలై 5: రాష్ట్రపతి అవార్డు గ్రహీత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మాస్ మీడియా అధికారిగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన మద్దెల ప్రమీలాదేవిని ఘనంగా సన్మానించారు. కర్నూలు జీజీహెచ్ కార్యాలయ ఆఫీసు సూపరింటెండెంట్ కుమారస్వామి ఆమెను శుక్రవారం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38 సంవత్సరాలు వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తు అనేక రకమైన అవార్డులను పొందారన్నారు. నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును 2017లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గిరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ కార్పొరేటర్ల సమావేశం

కర్నూలు(న్యూసిటీ), జూలై 5: కర్నూలు, కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాలకు సంబంధించి వైసీపీ కార్పొరేటర్ల సమావేశం శనివారం నిర్వహించేందుకు మేయర్ బీవై.రామయ్య ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని బీఎఎస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసే సమావేశానికి ఎంత మంది కార్పొరేటర్లు వస్తారో అర్థం కావడం లేదు. గతంలోనే కొందరు వైసీపీ కార్పొరేటర్లు మేయర్‌పై కౌన్సిల్ సమావేశంలోనే ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటలున్నాయి. దీంతోపాటు వైసీపీ 12వ వార్డు కార్పొరేటర్ అన్నెపోగు క్రాంతికుమార్‌ను కౌన్సిల్ సమావేశంలో బయటికి ఈడ్చిపడేయండి అంటూ మేయర్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటను ఇప్పటికి కార్పొరేటర్లు గుర్తుపెట్టుకుని ఉన్నారు. కేవలం తన పదవిని కాపాడుకోవడానికే మేయర్ ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్లు అంటున్నారు.

పండ్ల తోటల తోటలతో అధిక లాభాలు

సి.బెళగల్, జూలై 5: పండ్ల తోటలతో అధిక లాభాలు సాధించవచ్చని కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌గౌడు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణ దొడ్డి, ఇనగండ్ల, పోలకల్లు గ్రామాల్లోని రైతులతో ఆయన మాట్లాడారు. సన్నకారు రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండో రోజూ రెవెన్యూ అధికారుల స్పెషల్ డ్రైవ్

కర్నూలు(కల్చరల్), జూలై 5: నగర పాలక సంస్థకు చెందిన దుకాణాలను లీజుకు తీసుకొని అద్దె చెల్లించని షాపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేస్తున్నారు. నగరపాలక సంస్థ ఆదేశాలతో సంస్థకు చెందిన రెవెన్యూ అధికారులు రెండో రోజు స్పెషల్ డ్రైవ్ కొనసాగించారు. శుక్రవారం రూ.12,26,21 6లను వసూలు చేసినట్లు కమిషనర్ తెలి పారు. ఇంకా రూ.1.26 కోట్లు బకాయిలు ఉన్నాయని, దుకాణదారులు జాప్యం చేయకుండా బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు.

ఘనంగా రావూరి భరద్వాజ్ జయంతి



భరద్వాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 5: స్థానిక ఉద్యోగ నగర్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం జ్ఞానపీఠ్ అవార్డు గ్రహిత రావూరి భరద్వాజ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయాచారి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటరమణాచారి, శ్రీనివాసులు భరద్వాజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావూరి భరద్వాజ్ తెలుగు లఘు కథారచయిత, నవలా రచయిత, రేడియోల రచయితగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మణాచారి వెంకటస్వామి బ్రహ్మయ్య ఆచారి, విశ్వబ్రాహ్మన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి తైక్వాండో గోల్డ్ మెడల్



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 5: స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.కార్తిక్ గోల్డ్ మెడల్ సాధించారు. తైక్వాండో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 30న నంద్యాల మున్సిపల్ టౌన్ హాలులో జరిగిన ఈ పోటీలో పి.కార్తిక్ గోల్డ్‌మెడల్ సాధించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ కార్తిక్‌కు గోల్డ్‌మెడల్‌తోపాటు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సుబ్రహ్మణ్యం, నాగమణి, నరసింహం పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు(న్యూసిటీ), జూలై 5: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నగర పాలక సంస్థ కమిష నర్ భార్గవతేజ అన్నారు. శుక్రవారం నగరంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. సచివాలయ కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 5,7,8 డివిన్లలో సోడియం హైపోక్లోరైడ్ పిచికారి ముమ్మరంగా సాగుతుందని, 4వ డివిజన్లో పూడిక తీత పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

కర్నూలు డివిజన్ కార్యాలయంలోకి ఆకతాయిలు

» రాత్రివేళల్లో గెస్ట్‌హౌస్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు
» ప్రహరీ నిర్మించాలని విద్యుత్ సంఘాల నాయకుల డిమాండ్

కల్లూరు, జూలై 5: కర్నూలు డివిజన్ విద్యుత్ కార్యాలయంలోకి ఆకతాయిల తాకిడి ఎక్కువైంది. కర్నూలు డివిజన్ కార్యాలయం పక్కనే మున్సిపల్ పాఠశాల నిర్మాణం గత రెండేళ్లుగా జరుగుతోంది. ఈనేపథ్యంలో వాహనాల రాకపోకలు సాగించేందుకు గెస్ట్‌హౌస్ ప్రాంతంలోని నరసింహారెడ్డినగర్ వైపు అధికారులు దారి ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు పాఠశాల నిర్మాణం జరుగుతున్నందున ద్విచక్ర వాహనాలు, ఇసుక ట్రాక్టర్లతో పాటు ఇతరులు ఈ ప్రాంతంలో తిరుగుతూ చెట్ల కిందకూర్చొని అసాంఘిక



గెస్ట్‌హౌస్‌లో ఆకతాయిలు పగలగొట్టిన మందు సీసాలు



గెస్ట్‌హౌస్ ప్రాంతంలో మున్సిపల్ పాఠశాలకు ఏర్పాటు చేసిన దారి

కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఆకతాయిలు లోపలికి రాకుండా ప్రహరీ నిర్మించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

● **రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు:** కర్నూలు డివిజన్ విద్యుత్ కార్యాలయం పక్కనే గెస్ట్‌హౌస్ ఉండగా నిర్వహణ లేక చెత్తాచెదారంతో నిండిపోయింది. మున్సిపల్ పాఠశాల నిర్మాణం కోసం నరసింహారెడ్డి నగర్ వైపు నుంచి వాహనాల రాకపోకల కోసం ప్రహరీని తొలగించారు. దీంతో బయటి వ్యక్తులు కూడా కర్నూలు డివిజన్‌లోని గెస్ట్‌హౌస్ ప్రాంతం లోకి వస్తున్నారని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. రాత్రి వేళల్లో మందు బాబులు అక్కడికి చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడు తున్నట్లు తెలుస్తోంది. గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో మందు సీసాలు పగులగొట్టి గందర గోళం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా కర్నూలు డివిజన్ కార్యాల యంలో విలువైన విద్యుత్ సామగ్రి చోరీకి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి విద్యుత్ ఉద్యోగుల గెస్ట్‌హౌస్ వరకు ప్రహరీ నిర్మించి, ఇతరులు లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయా సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఘనంగా మంత్రి బీసీ జన్మదిన వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి బీసీ అభిమానులు

కర్నూలు(కల్చరల్), జూలై 5: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగర శివారు పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుకనున్న విజ్ఞాన పీఠం (అరక్షిత బాలుర) ఉన్నత పాఠశాల్లో భారీ కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేసి, చలి నుంచి రక్షణకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకుముందు బీసీ జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విజ్ఞానపీఠం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ పీపీ గురుమూర్తి మాట్లాడుతూ బీసీ జనార్దన్‌రెడ్డి జనాదరణ కలిగిన నాయకుడని అన్నారు. కార్యక్రమంలో బీసీ అభిమానులు సోమశేఖర నాయుడు, రాయలసీమ సలాం, జలదుర్గం విమలాదేవి, వెంకన్నబావి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 5: నగరంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ-1 నాగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సంతోష్‌నగర్, అశోక్ నగర్ 11కెవి ఫీడర్‌ల పరిధిలో 33కెవీ తీగల ఏర్పాటు చేయనున్నందున కరెంట్ కోత ఉంటుందన్నారు. వెంకటరమణ కాలనీ, అమీన్ అబ్బాస్‌నగర్, రామలిం గేశ్వరనగర్, ఆశోక్‌నగర్, లేబర్‌కాలనీ సమీపంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

అధికారుల ఆకస్మిక తనిఖీలు

» రికార్డుల్లో నమోదు కానీ విత్తనాలు, పురుగు మందులు

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 5: జిల్లాలో డీలర్లు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది చర్యలకు ఏ మాత్రం భయపడడం లేదు. ఎవరేమి చర్యలు తీసుకున్నా తమను ఏమి చేయలేదనే ధీమాతో కర్నూలు, నంద్యాల జిల్లాలోని విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులు అమ్ముకుంటున్న డీలర్లు చెలరేగిపోతున్నారు. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించే దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. పెద్దమొత్తంలో అక్రమంగా రికార్డుల్లో నమోదు చేయకుండా నిల్వ ఉంచినట్లు ఫిర్యాదులు వెలువెత్తాయి. అయితే వారిపై తూతూ మంత్రంగా చర్యలకే అధికారులు పరిమితమైపోయి తమ కొంప ముంచుతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక వ్యవసాయాధికారులకు డీలర్లు ఏ మాత్రం భయపడక పోవడంతో ఇటీవల వ్యవసాయ శాఖ కమిషనర్ రాష్ట్ర వ్యాప్తంగా ఒక జిల్లాలో పని చేసే అధికారులను దూర ప్రాంతంలోని మరో జిల్లాలో దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కృష్ణా జిల్లాకు చెందిన ఏడీఏ శ్రీనివాస రావు, అదేవిధంగా పల్నాడు జిల్లాలోని ఏడీఏ హనుమంతరావు ఒక బృందంగా, అదేవిధంగా కర్నూలు జిల్లాకు చెందిన ఐపీసీ రామక్రిష్ణ, చంద్రశేఖర్‌లు ఆదోని కర్నూలు సబ్ డివిజన్‌లలో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలు, అంగళ్లపై తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 46.3 లక్షల విలువైన 5,453 క్వింటాళ్ల విత్తనాలను రూ.28.5 లక్షల



అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులు, క్రిమిసంహారక మందుల నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

విలువైన 123.32 మెట్రిక్ టన్నుల ఎరువులను, రూ.3 లక్షల విలువైన 56.25 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను జరపకుండా స్టాప్‌సేల్‌ను విధించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా జేడీ వరలక్ష్మి మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా విత్తనాలు, ఎరువులు పురుగు మందులకు సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(అర్బన్), జూలై 5: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ లాజరస్ కోరారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో కేవలం 40 శాతం సీట్లు మాత్ర మే కేటాయించారని, వాటిని పెంచాలని కోరారు. రాయలసీమ కరువు, వలసల ప్రాంతం కాబట్టి దాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి మండల కేంద్రంలో అదనంగా కస్తూర్బా గాంధీ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఏపీ మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు ప్రతి నెల రూ. 3వేలు నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంత రత్నం మాదిగ, బజా రన్న, సయ్యద్ నవీద్, రేపల్లె ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని కలిసిన ఏబీవీపీ బృందం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 5: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులో ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి పలు సమస్యలను విన్నవించినట్లు ఏబీవీపీ రాష్ట్ర ప్రతినిధి బృందం సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి తెలిపారు. గత జగన్ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించి విద్యార్థులకు చదువును దూరం చేసిందన్నారు. విశ్వవిద్యాలయం సైతం రాజకీయ క్షేత్రాలుగా వాడుకున్నారని ఆరోపించారు.

ముమ్మరంగా కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

కర్నూలు(కల్చరల్), జూలై 5: సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన పరిశీలన ప్రక్రియ నగర వ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోంది. ఇటీవల వీఆర్వోలతో సమావేశం నిర్వహించి, పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ ఆదేశించిన విషయం విదితమే. గురువారం 2728, శుక్రవారం 1816 పత్రాలను వీఆర్వోలు పరిశీలన ప్రక్రియ పూర్తి చేశారు. కాగా 19,704 కుల ధ్రువీకరణ పత్రాలకు ఇంకా పరిశీలన ప్రక్రియ జరగాల్సి ఉంది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోడుమూరు (రూరల్), జూలై 5: మండలంలోని గోరంట్ల వద్ద హంద్రీ నదిలో ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ బాలనరసింహులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్టేషన్ తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

గోశాలలో సామూహిక గో పూజ



గోపూజ చేస్తున్న భక్తులు

కర్నూలు(కల్చరల్), జూలై 5: ఆషాడ అమావాస్యను పురస్కరించుకొని నగర శివారు కల్లూరులోని అవధూత రామిరెడ్డి తాత గోశాలలో శుక్రవారం భక్తులు సామూహిక గో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోశాల అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గత పదకొండేళ్లుగా గోశా లను కొనసాగిస్తున్నామని, వివిధ ప్రత్యేక రోజుల్లో భక్తులతో సామూహిక పూజలు నిర్వహిస్తున్నామని, దాతలు గోవులకు గ్రాసం అందిం చేందుకు ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో గోశాల అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి, కమిటీ సభ్యుడు సాయిరాంరెడ్డి, భక్తులు కె.లక్ష్మీరెడ్డి దంపతులు, నాగవేణిరెడ్డి, గోవిందరాజులు, కట్ట సతీష్‌కుమార్, స్వామి స్వాత్మానంద, వీహెచ్‌పీ ధర్మ ప్రచారకులు పాల్గొన్నారు.

మాన్యం ఉన్నా.. నైవేద్యం సున్నా



పోలకల్లులోని బసవేశ్వరుడి ఆలయం

సి.బెళగల్, జూలై 5: మండలంలోని పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి, గొల్లల దొడ్డి, ముడమాల, బురాన్‌దొడ్డి, చింతమానుపల్లె, సి.బెళగల్, తిమ్మనదొడ్డి, సంగాల, కొండాపురం, గుండ్రేవుల గ్రామాలలోని అంజేయస్వామి, ఈశ్వరుని దేవాలయాలు, కేశవస్వాముల ఆలయాలకు వంద ఎకారాల మాన్యాలు ఉన్నా నైవేద్యం సున్నా అని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దేవదాయ శాఖ వారు మాత్రం సంవత్సరానికి ఒక్కసారి గ్రామాలకు వచ్చి ఒక్కరిని ఇద్దరిని పిలుచుకుని మాట్లాడి గుట్టుగా దేవుని మాన్యాల సాగుకు నామ మాత్రంగా వేలం వేసి వెళ్లిపోతున్నారని, అట్లా వచ్చిన సొమ్ము వారే తీసుకెళ్లి పోతున్నారని అంటున్నారు. ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు ఏర్పాట్లు కూడా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సిబెళగల్ మండలంలోని దేవాలయ భూములను కాపాడాలని, వేలం ద్వారా వచ్చే డబ్బును ఆలయ అభివృద్ధికి, పూజలకు వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత



కొళాయి గుంతలలో నీటి నిల్వ ఉంచరాదని సూచిస్తున్న కమిషనర్

గూడూరు, జూలై 5: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతగా గుర్తించాలని నగర కమిషనర్ దివాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని ఆయా వార్డుల్లో ఏఈ నరసింహులు, నగర పంచాయతీ, సచివాలయ సిబ్బందితో కలిసి కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కొళాయి గుంతల్లో నీటి నిల్వ ఉంచుకోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయా లని, రోడ్లపై వేసిన చెత్తాచెదారాన్ని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ నరసింహులు, నగర పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బెల్లం ఊట ధ్వంసం.. ఇద్దరి అరెస్టు



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

కోడుమూరు(రూరల్), జూలై 5: కోడుమూరు సెబ్ పోలీసులు జరిపిన దాడుల్లో బెల్లం ఊట ధ్వంసం చేయడంతోపాటు నాటుసారా, కర్ణాటక మద్యం సీజ్ చేశారు. సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలివి. స్టేషన్ పరిధిలోని ఆగవేలి గ్రామ శివారులో ఎరుకలి మద్దిలేటి అనే వ్యక్తి నాటుసారా తయారు చేస్తుండగా దాడి చేసి 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం, 10 లీటర్ల నాటుసారా సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే కోయిలకొండ గ్రామంలో మద్దయ్య అనే వ్యక్తి నుంచి 20 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు వివరించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది హను మంతు, వెంకటేష్‌నాయక్, అన్సార్‌బాషా, వీరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

రోడ్డు వేశారు.. బ్రిడ్జి నిర్మించడం మరిచారు



సి.బెళగల్, జూలై 5: మండలంలోని పోలకల్లు నుంచి ముడుమాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఇటీవల రోడ్డు వేశారు. అయితే రోడ్డుకు ఇరుపక్కల బిడ్జీలను నిర్మించకుండా వదిలేశారు. దీంతో ప్రయాణికులు గుంతలో పడి నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనదారులు అదమరిస్తే అంతే ఆదివారం ముడుమాల, కొండాపురం, ఈర్లదిన్నె, శింగవరం, పల్లెదొడ్డి గుండ్రేవుల గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన బిడ్జి నిర్మించాలని కోరుతున్నారు. అలాగే రోడ్డు టర్నింగ్ దగ్గర రోడ్డు మలుపులను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీఎంల భేటీలో సీమ ప్రాజెక్టులపై చర్చించాలి

ఆర్‌వీపీఎస్ నాయకులు డిమాండ్



మాట్లాడుతున్న ఆర్‌వీపీఎస్ నాయకులు

కర్నూలు(అర్బన్), జూలై 5: రెండు తెలుగురాష్ట్రాల సీఎంల భేటిలో రాయలసీమ ప్రాజెక్టులపై చర్చించాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఆర్వీపీఎస్ కార్యాల యంలో రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్నతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డిలు రాయలసీమ- తెలంగాణ మధ్య నిర్మించాల్సిన గుండ్రేవుల ప్రాజెక్టు, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాలకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం వస్తే ప్రాణం తీశారు..

» ప్రైవేట్ హాస్పిటల్ ఎదుట మృతదేహంతో రోగి బంధువుల ఆందోళన



హాస్పిటల్ ఎదుట ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 5: నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంతో రోగి మృతి చెందాడంటూ తెలంగాణ రాష్ట్రం అయిజకు చెందిన రోగి బంధువులు శుక్రవారం హాస్పిటల్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేశారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా అయిజకు చెందిన ఖాజామొద్దీన్ (60) బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతూ నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న ఓ హాస్పిటల్‌లో ఈ నెల 2వ తేదీన అడ్మిషన్ పొందారు. రెండు రోజులుగా ఆరోగ్యంగా ఉన్న రోగి శుక్రవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ మృతి చెందారు. అర్ధరాత్రి 12 గంటలకు రోగికి నిద్రమాత్ర వేయగా.. తెల్లవారు జామున మృతి చెందాడని వైద్యులు సరిగ్గా పట్టించుకోకపోవడం వల్లే రోగి చనిపోయాడని బంధువులు హాస్పిటల్ ఎదుట ఆందోళన చేశారు. హాస్పిటల్‌ను కలెక్టర్ సీజ్ చేయించాలని రోగి బంధువులు డిమాండ్ చేశారు. రోగికి తీవ్ర అస్వస్థత ఉందని శుక్రవారం తెల్లవారు జామున 4.30 గంటలకు చెబితు 5.30 గంటలకు వైద్యులు వచ్చారన్నారు. మూడు రోజులుగా రోగిని ఐసీయూలో ఉంచకుండా డబ్బులు ఇస్తేనే ఐసీయూలో పెడతామన్నారని మండిపడ్డారు.

ఉప్పర్లపల్లి పంచాయతీని అభివృద్ధి చేయాలి


ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసిన నాయకులు

తుగ్గలి, జూలై 5: ఉప్పర్లపల్లి పంచాయతీని అభివృద్ధి పథంలో నడపడానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కోరినట్లు టీడీపీ సీనియర్ నాయకులు అప్పా వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి ఉప్పర్లపల్లి, సూర్యతాండ, బాట తాండ పంచాయితీలలో ఉన్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడు, ప్రసాద్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడుల సాయం అందించాలి

తుగ్గలి, జూలై 5: రైతులకు పెట్టుబడుల సాయం అందించాలని సీపీఐ తాలుకా రైతు సంఘం నాయకులు ఉమాపతి కోరారు. శుక్రవారం పెండేకల్ ఆర్ఎస్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి న్యాయం జరగలేదని కనీసం టీడీపీ ప్రభుత్వంలోనైనా రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి


హెడ్ కానిస్టేబుల్ సాతర్ల రమేష్(ఫైల్)

మంత్రాలయం, జూలై 5: మంత్రాలయం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సాతర్ల రమేష్ (51) శుక్రవరం మృతి చెందినట్లు మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. గత 15 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఈయన మృతి పట్ల ఆదోని డీఎస్పీ, మంత్రాలయం సీఐ ఎరిషావలి, ఎస్ఐ గోపినాథ్, ఏఎస్ఐ ఆనందరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణయ్య తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుడికి భార్య లలితమ్మ, కూతురు లావణ్య, కుమారుడు రాహుల్ ఉన్నారు. శనివరం పోలీసు లాంఛనాలతో ఆదోనిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

దేవనకొండ, జూలై 5 : దమ్మర కులస్తులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మునిస్వామి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామ శివారుల్లో గుడారాలు వేసుకొని జీవనం సాగిస్తున్నామని, అక్కడ మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేసి న్యాయం చేయాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో పిల్లల భవిష్యత్ ప్రశార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు అనంతరం తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ధర్మ,శివ,రాము,చిట్టి పాల్గొన్నారు.

మండల అభివృద్ధి సహకరిస్తాం


నీతి అయోగ్ కోఆర్డినేటర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మద్దికెర, జూలై 5: వెనుకబడిన ప్రాంతాల అభ్యున్నతి కోసం సంపూర్ణ అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో భాగంగా మండల అభివృద్ధి సహకరిస్తామని శ్రీవిద్యాసాయి కళాశాల, పాఠశాల ఎండీ వెంకటమాదవ్, ప్రిన్సిపాల్ బాల సునిత అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో నీతి అయోగ సంస్థ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర నీతి అయోగ్ కోఆర్డినేటర్ స్మృతి సబర్వాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పీఈటీ భాస్కర్ యాదవ్, తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆలూరు, జూలై 5: ఆలూరు నియోజకవర్గంలో నెలకొన్న తాగు నీటి సమస్యపై కలెక్టర్ రంజిత్ బాషాకు ఫిర్యాదు చేసినట్లు టీడీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆలూరులో 16 రోజులు గడిచినా తాగునీరు సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇది ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ఉందన్నారు. త్రాగునీటి కోసం ఎల్లెల్సీ కాలువలకు నీరు వదిలినా, నీటి సమస్య ఎందుకు తీరడం లేదన్నారు. అధికారులు త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం గ్రామ పంచాయతి, సర్పంచులు, సిబ్బంది ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయం చేసుకొని కనీసం వారానికి ఒక్కసారైనా నీరు సరఫరా అయ్యే విధంగా చూడాలన్నారు.

తుంగభద్రకు పోటెత్తిన వరద



హాలహర్వి, జూలై 5: ఎగువన కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తింది. మొన్నటి వరకు 5 టీఎంసీలకే పరిమితమైన జలాశయం రెండు రోజుల్లో 12 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుతం 20 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో రైతుల్లో ఆనందం వెల్లువిరిసింది. ఆగుంబె, మలేనాడు, శివమొగ్గ, హరిహర ప్రాంతాల్లో వర్షాలు జోరందుకున్నాయి. దీంతో వరద ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని తుంగభద్ర బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు.

కురువలను మాదాసి, మాదారి కురువలుగా గుర్తించాలి

ఆలూరు, జూలై 5: ప్రభుత్వం సుమోటోగా జారీ చేస్తున్న కుల ధృవీకరణ పత్రంలో కురువ అని పిలవబడే కులస్తులను ఎస్సీ కుల జాబితా 31లో ఉన్న మదాసి/మాదారి కురువగా ఉన్నట్లు గుర్తించి కుల ధృవీకరణ పత్రలు జారీ చేయాలని మదాసి/మదారి కురువ స్టేట్ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు మనేకుర్తి రాజశేఖర్ డిమాండ్ చేశారు.. శుక్రవారం ప్రభుత్వం సుమోటోగా చేపడుతున్న కుల ధ్రువీకరణను మనేకుర్తి గ్రామంల వీఆర్వో విచారించచకుండా, వీఆర్ఏ అని చెప్పుకొనే ద్వారా, గ్రామ ప్రజలకు వివరంగా చెప్పకుండా వివిధ పథకాల కోసమని మభ్యపెట్టి కురువ అని పిలవబడే కులస్తుల నుంచి ఆధార్, రేషన్ కార్డు తీసుకెళ్లి రెవెన్యూ కార్యాలయంలో బీసీ కురుబ/కురువగా అప్‌లోడ్ చేస్తున్నారన్నారు.. అప్‌లోడ్ చేసిన వాటిని రిజెక్ట్ చేసి గ్రామస్తులను మభ్యపెట్టిన వీఆర్వో, వీఆర్ఏలపై చర్యలు తీసుకోవాలని ఆలూరు తహసీల్దార్ చంద్రశేఖర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు.. కార్యక్రమంలో గ్రామస్తులు సురేష్, ఆంజనేయ, లక్ష్మీకాంత్, హరికృష్ణ పాల్గొన్నారు.

పత్తికొండను అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ

మద్దికెర, జూలై 5: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో జరిగిన నీతి అయోగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పత్తికొండ తాలుకాలోని అన్ని చెరువులకు హంద్రీనీవా ద్వారా నీరు అందిస్తామన్నారు. పత్తికొండ తాలుకాలోని ఐదు మండలాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. మద్దికెర గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చూశామని గుర్తు చేశారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తాలుకాను అభివృద్ధి చేయడం జరిగిందని, ఇప్పుడు మరింత ఎక్కువగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అలివేలమ్మ, తహసీల్దార్ రజాక్‌వలి, టీడీపీ నాయకులు గుడూరు ధనుంజయుడు, రాజన్న యాదవ్, చంద్రశేఖర్ గౌడు, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ చౌదరి, రంగయ్య, నరసింహులు గౌడు, సర్పంచులు బొమ్మనపల్లి అంజనేయ, నంది కల్పన తదితరులు ఉన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, జూలై 5: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అండగా నిలిచే సొసైటీల అభివృద్ధికి కృషి చేయాలని మారెల్ల సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు కోరారు. శుక్రవారం పత్తికొండలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి సొసైటీ అభివృద్ధి కోసం పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ కార్యాలయాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రైతులకు మరిన్ని పథకాలు అందేలా సొసైటీలను అభివృద్ధి చేయాలన్నారు. అలాగే ప్రతి రైతు ప్రతి సంవత్సరం వారి రుణాలను రెన్యువల్ చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సొసైటీ సభ్యత్వం కూడా రెన్యువల్ చేసుకోవాలన్నారు.

భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య


గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న రోహిత్ కుమార్ బంధువులు

ఎమ్మిగనూరు/గుంతకల్లు, జూలై 5: భార్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక వడ్డె రోహిత్ కుమార్(24) అనే యువకుడు గురువారం రాత్రి ఉరివేసుకున్నాడు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని బీరప్ప సర్కిల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. బీరప్ప సర్కిల్‌లో నివాసముంటున్న రోహిత్ కుమార్ గుంతకల్లు పట్టణంలోని ఓ ద్విచక్ర వాహన షోరూంలో మెకానిక్‌గా పని చేసేవాడు. ఇతనికి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన లక్ష్మీదేవితో గత ఏడాది ఫిబ్రవరిలో వివాహమైంది. వీరికి కుమారుడు. వివాహం జరిగిన కొన్నాళ్ల తరువాత దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో పుట్టింటికి వెళ్లిపోయిన లక్ష్మీదేవి.. తన భర్త రోహిత్‌కుమార్, అతని కుటుంబ సభ్యులపై ఎమ్మిగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో 498-ఏ సెక్షన్ కింద కేసు నమోదైంది. ఆ తరువాత కాపురానికి వచ్చేందుకు తన పేరిట 10 సెంట్లు, తన కుమారుడి పేరిట 10 సెంట్ల స్థలం రాసివ్వాలని పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టింది. దీనికి రోహిత్ కుమార్ కుటుంబం ఒప్పుకుని, స్థలాలు రాసివ్వడంతో ఆమె కాపురానికి వచ్చింది. కొన్నాళ్ల క్రితం వీరి కుమారుడు ఆనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో లక్ష్మీదేవి తిరిగి పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి తిరిగి రాకపోవడంతో పది రోజుల క్రితం రోహిత్ కుమార్ గుంతకల్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రెండు కుటుంబాలవారిని సీఐ గణేష్ కుమార్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. తాను కోర్టులో చూసుకుంటానని చెప్పి లక్ష్మీదేవి వెళ్లిపోయింది. ఆ తరువాత తన భర్త రోహిత్‌కుమార్, అతని కుటుంబ సభ్యులతోపాటు సీఐ గణేష్ కుమార్‌కు లాయర్ ద్వారా నోటీసులు పంపించింది. రోహిత్ కుమార్‌కు ఫోన్ చేసి వేధించేది. దీంతో మనోవేదనకు లోనైన రోహిత్ కుమార్.. గురువారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తమ కోడలు లక్ష్మీదేవి, ఆమె కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రోహిత్ కుటుంబం గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శుక్రవారం బైఠాయించింది. పోలీసులు వారికి నచ్చజెప్పారు. మృతుడి తండ్రి వడ్డె కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మామను నరికి చంపిన అల్లుడు

- భార్యను కాపురానికి పంపలేదని..
- అనంతపురం జిల్లాలో దారుణ సంఘటన


లక్ష్మన్న (ఫైల్)

గుంతకల్లు టౌన్/ చిప్పగిరి, జూలై 5: భార్యను కాపురానికి పంపకపోవడం, పెద్ద మనుషుల పంచాయితీలో దూషించడంతో కక్ష పెంచుకున్న అల్లుడు.. దారికాచి మామను నరికేశాడు. అనంతపురం జిల్లాలోని గుంతకల్లు మండలం నల్లదాసరిపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నల్లదాసరిపల్లికి చెందిన ఆవుల లక్ష్మన్న(52), క్రిష్ణవేణి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో కూతురు లలితను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇచ్చి 2021లో వివాహం చేశారు. తాగుడుకు బానిస అయిన చంద్రశేఖర్, పుట్టింటి నుంచి డబ్బులు తేవాలని భార్యను వేధించేవాడు. ఈ కారణంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. లలిత గర్భం దాల్చడంతో ఆరు నెలల కింద పుట్టింటికి పిలుచుకువచ్చారు. మూడు నెలల క్రితం లలితకు కూతురు పుట్టింది. ఇప్పటికీ నల్లదాసరిపల్లిలోనే ఉంటోంది. అల్లుడి ప్రవర్తన నచ్చక.. ఆమెను పుట్టింటివారు కాపురానికి పంపలేదు. దీంతో చంద్రశేఖర్ పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టాడు. కాపురానికి రానిపక్షంలో మూడు నెలల పాపను తానే పెంచుకుంటానని అన్నాడు. 'పాలుతాగే పసిబిడ్డను ఎలా తీసుకెళతావు..? బుద్ధి లేదా..?' అని అల్లుడిని లక్ష్మన్న మందలించాడు. ఇలా పంచాయితీలో అవమానం జరిగిందని మామ మీద చంద్రశేఖర్ కక్ష పెంచుకున్నాడు. ఆయనను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో లక్ష్మన్న గురువారం పనిమీద గుంతకల్లుకు వెళ్లాడు. సాయంత్రం 6-30 గంటలకు బైక్‌లో స్వగ్రామానికి తిరుగు పయనమయ్యాడు. అదే మార్గంలోని తిమ్మాపురం సమీపంలోని నక్కా ఓబులేసు పొలం వద్ద చంద్రశేఖర్, అతడి అన్న రాజశేఖర్, అన్న స్నేహితుడు సతీష్ మాటు వేశారు. లక్ష్మన్న రాగానే ఒక్కసారిగా కత్తులతో విచక్షణా రహితంగా నరికేసి, పారిపోయారు. చీకటి పడినా లక్ష్మన్న ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. సెల్‌ఫోన్ రింగ్ అవుతున్నా స్పందించకపోవడంతో అనుమానం వచ్చి, గుంతకల్లు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సెల్‌ఫోన్ లోకేషన్ తిమ్మాపురం వద్ద చూపించడంతో రూరల్ ఎస్ఐ కె.సురేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే లక్ష్మన్న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. హత్య చేసిన అల్లుడు చంద్రశేఖర్ ఏమీ ఎరగనట్లు అక్కడికి వచ్చి ఏడుస్తున్నట్లు నటించాడు. లక్ష్మన్న వైసీపీ వర్గీయుడు కావడంతో టీడీపీవారే హత్య చేసి ఉంటారని పోలీసులను పక్కదారి పట్టించడానికి ప్రయత్నించాడు. పోలీసులు అనంతపురం నుంచి క్లూస్ టీంను, జాగిలాలను రప్పించారు. జాగిలాలు అక్కడే ఉన్న చంద్రశేఖర్ వద్దకు వెళ్లి ఆగిపోవడంతో వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో మరో ఇద్దరితో కలిసి తన మామను తానే హత్య చేశానని ఒప్పుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

ఆదోని(అగ్రికల్చర్) , జూలై 5: పురపాలక పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు కోరారు. శుక్రవారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో సీనియర్ నాయకుడు నిరంజన్ కుమార్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు పెట్టిందన్నారు. అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. గత ప్రభుత్వంలో రావాల్సిన కరువు భత్యం, సరెండర్ లీవ్ సొమ్ము, పీఆర్సీ బకాయిలను, జీఈపీఎఫ్ రుణాలను దారి మళ్లించారని ఆరోపించారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, భీమరాజు, నాయకులు ప్రసాద్, రాజా సతీష్, మారయ్య, విజయకుమార్, గురురాజ, శ్రీనివాసులు, నగేష్, రాముడు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశైలం తాత ఆరాధన


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆస్పరి, జూలై 5: మండలంలోని ములుగుందం గ్రామంలో కొలువుదీరిన శ్రీశైలం తాత ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, కుంకమార్చన, మహా మంగళ హారతులు నిర్వహించారు. సాయంత్రం తాత రథోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లికార్జున రెడ్డి, నాయకులు మనోహర్ రెడ్డి, నర్సిరెడ్డి, ధనుంజయ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


నినాదాలు చేస్తున్న మాదాసి కురువ సంఘం నాయకులు

ఆలూరు, జూలై 5: సందవరం మండలం జోహరాపురంలో మాదాసి కురువ సామాజిక వర్గం వారిపై దాడి చేసిన అగ్రవర్ణాల నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆలూరు తాలూకా మదాసి కురువ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఆలూరులో మాట్లడుతూ పొలం విషయంలో కురువ మల్లేష్, కురువ నాగేంద్ర, కురువ పరమేష్‌తో పాటు మహిళలు సరస్వతమ్మ, పెద్ద రాములమ్మలను అగ్రవర్ణాలకు చెందిన సంజీవరెడ్డి, బాలురెడ్డి, అర్జున్ రెడ్డి, రాఘవరెడ్డి, రామకృష్ణ రెడ్డిలు కొడవళ్లు, రాడ్లు, కర్రలతో దాడి చేశారని ఆరోపించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండలం సలహాదారుడు శేషప్ప, మాదాసి కురువ సంఘం నాయకులు బసవరాజ్, కనక ఎస్‌కే గిరి పాల్గొన్నారు.

యశ్వంత్‌పూర్ రైలును ఆదోనిలో ఆపాలి

ఆదోని టౌన్, జూలై 5: యశ్వంత్‌పూర్ నుంచి జైపూర్‌కు వెళ్లే వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు ఆదోని రైల్వేస్టేషన్‌లో నిలపాలని ప్రభుత్వ మాత, శిశువుల ఆసుపత్రి సలహా సంఘం సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆదోనిలో స్టాపింగ్ లేపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే డా పార్థసారథి ఈ విషయంలో జోక్యం చేసుకొని యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలును నిలిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల్లో బయటపడిన రూ.2 లక్షల అవినీతి

రికవరీకి ఆదేశించిన పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 5: ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో 2023-24లో జరిగిన ఉపాధి పనుల్లో రూ.2 లక్షల అవినీతి చోటు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలో బయటపడింది. వారం రోజులకుపైగా ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై 17వ సోషల్ ఆడిట్ అధికారులు గ్రామగ్రామాన తిరిగి ఎన్ని పనులు జరిగాయి.. ఎంత ఖర్చు పెట్టారనే విషయాలను సేకరించారు. అలాగే గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి జరిగిన పనులపైన, ఖర్చు చేసిన మొత్తాన్ని గ్రామ సభల్లో ప్రజలకు తెలియజేశారు. చివరిగా 17వ సామాజిక తనిఖీ బృందం సేకరించిన వివరాలను గురువారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనం ముందు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి అమర్‌నాథ్‌రెడ్డి(పీడీ) అధ్వర్యంలో బహిరంగ సమావేశంలో వెల్లడించారు. ఎమ్మిగనూరు మండలంలో మొత్తం 16జీపీల్లో 2,110 పనులు జరిగాయన్నారు. ఇందుకు మొత్తం రూ.10 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. రూ.10కోట్ల ఖర్చులో రూ.2,062,98లు అవినీతి జరిగిందన్నారు. ఫెనాల్టీ కింద రూ.18,500 వసూలు చేస్తామని తెలిపారు. ఇందులో రూ.5వేలను రికవరీ చేశామని, మిగిలిన మొత్తాన్ని రికవరీ చేయాల్సి ఉందన్నారు. 16 జీపీల్లో ఒక్క కడిమెట్లలోనే అత్యధికంగా రూ.193898 అవినీతి చోటు చేసుకుందన్నారు. ఇందుకు సంబంధించిన టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణకు ఆదేశించామన్నారు. అలాగే దైవందిన్నె గ్రామంలో రూ.172 అత్యల్పంగా అవినీతి జరిగిందన్నారు. విచారణలో బయటపడ్డ అవినీతి మొత్తాన్ని వసూలు చేస్తామన్నారు. బహిరంగ సమావేశంలో ఎంపీపీ కేశన్న, అడిషనల్ పీడీ మాధవీలత, జిల్లా విచారణ అధికారి విజయ్‌భాస్కర్, ఏపీడీ అల్లిపీర, ఎంపీడీవో కొండన్న, పీఆర్ ఏఈ శంకర్, ఏపీవో విజయ్‌మోహన్, వాటర్‌షెడ్ పీవో వలిబేగ్, విజిలెన్స్ సెక్షన్ అధికారి ఆదినారాయణలతో పాటు ఆయా గ్రామాల టీఏలు, సీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం మట్టి నమూనాలు సేకరించాలి


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి

మద్దికెర, జూలై 5: జిల్లాలో ఆయా మండలాల్లో రైతులు సాగు చేసే పంట పొలాల్లో లక్ష్యాన్ని ఇవ్వడం జరిగిందని, వంద శాతం మట్టి నమూనాలు సేకరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌బీకే కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేని మందులు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులు మాత్రమే అమ్మాలన్నారు. రైతులు మీ పంట పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏ పంట సాగు చేయాలో వివరాలు తెలుస్తుందన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు గుర్తింపు కార్డులను పొందాలన్నారు. ఎరువుల దుకాణాల యజమానులు ఏ ధరలకు ఎరువులు అమ్ముతున్నారో వివరాలను బోర్డులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ శాఖ అదికారి యు.రవి, సిబ్బంది జాకీర్ ఉన్నారు.

టెంకాయల వేలం మళ్లీ వాయిదా

కౌతాళం, జూలై 5: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వద్ద టెంకాయల విక్రయానికి వేలం పాటలు మరో సారి వాయిదా పడ్డాయి. శుక్రవారం దేవాలయ కార్యాలయంలో డీసీ వెంకటేష్ అధ్యక్షతన వివిధ పనులకు టెండర్లు పిలువగా ఇందులో దేవాలయానికి ఆదాయాన్ని సమకూర్చే ముఖ్యమైన టెంకాయల సరఫరాతో పాటు కొబ్బరి చిప్పలను పొగు చేసుకునే హక్కుకు బహిరంగ, సీల్డ్, ఆన్‌లైన్ టెండర్లు పిలువగా ఆన్‌లైన్, బహిరంగ వేలం పాటలకు టెండరుదారులు ఎవరు ముందుకురాలేదు. అయితే సీల్డ్ టెండరుకు ముగ్గురు టెండర్లు వేయగా ఉరుకుంద గ్రామానికి చెందిన రామనగౌడ్ అత్యధికంగా రూ.75,00,699లకు సొంతం చేసుకున్నాడు. అయితే టెండరు దక్కించుకున్న వెంటనే పాటపాడిన మొత్తాన్ని చెల్లించకపోవడంతో టెండరును ఆలయ డీసీ వెంకటేష్ రద్దు చేసి తిరిగి ఈ నెల 20న టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదోని దేవదాయశాఖ అధికారి వెంకటేష్, సీఐలు ఎరిషావలి, మంజునాథ, ఎస్ఐలు నరేంద్ర కుమార్ రెడ్డి, రమేష్‌బాబులు ఉన్నారు.

ఉరుకుందలో అమావాస్య పూజలు

కౌతాళం, జూలై 5: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా భక్తులు పోటెత్తారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ ఏర్పాట్లను చేపట్టారు. స్వామి దర్శనానికి మన రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణులు

ఎమ్మిగనూరు, జూలై 5: ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డిని జిల్లా టీడీపీ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పొనకలదిన్నె రాజన్న ఆధ్వర్యంలో కలిశారు. ఎమ్మెల్యే బీవీని పూల మాలలు, శాలువతో ఘనంగా సత్కరించారు. బీవీ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మంగలి ప్రభాకర్, హనుమంతు, మల్లికార్జున, గోవిందు, కృష్ణ, రాజు, నాగరాజు, పెద్దయ్య, రంగన్నలు పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం

గోనెగండ్ల, జూలై 5: ప్రస్తుతం సాగు చేసిన పంటలకు రసం పీల్చే పురుగులు, గులాబి రంగు పురుగులు, తెల్లదోమ, పచ్చ దోమ, తామర పురుగులు, పేను బంక తదితర పురుగు సోకుతాయాని వాటి నివారాణకు రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పత్తి పంటలో గులాబి రంగు పురుగునివారణకోసం వేపనూనె ఎకరానికి 400 మిల్లిలీటర్లు పిచికారి చేసుకోవాలన్నారు. లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వంట సామగ్రి అందజేత

వెల్దుర్తి, జూలై, 5: మండలంలో పుల్లగుమ్మి గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి నిరాశ్రయులైన సామన్న కుటుంబాన్ని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆపన్నహస్తం అందించింది. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గోవిందరెడ్డి, ట్రెజరర్ రఘునాథరెడ్డి శుక్రవారం కర్నూలు రెడ్‌క్రాస్ కార్యాలయంలో సామన్న కుటుంబానికి వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, కొంత నగదును అందజేశారు.

ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు కోర్సులు

ఆలూరు, జూలై 5: ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా సంవత్సరానికి గాను రెండు అదనపు కోర్సులు ప్రవేశ పెడుతున్నట్లు ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ శుక్రవారం తెలిపారు. కళాశాల ఆరంభం అయిన్నప్పటి నుంచి బీఏ (హిస్టరీ) మాత్రమే ఉండేదని, ఇతర కోర్సుల కోసం విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్ళేవారని, ప్రభుత్వం విద్యార్థి సంఘాలు, ప్రజా ప్రతినిధుల విన్నతుల మేరకు అదనంగా బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ జువాలజీ కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ఉత్తర్యులు జారీ చేసిందన్నారు. ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవలన్నారు.. బీఏ. (హిస్టరీ) గ్రూప్‌లో-40, బీకకాం (కంప్యూటర్స్)లో 60, బీఎస్సీ జూవాలజీలో-40 సీట్లు ఉన్నాయన్నారు. మూడు విడతల్లో సీట్ల భర్తీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

హాలహర్వి, జూలై 5: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం బాధ్యతగా తీసుకోవాలని టీబీ బోర్డు డీఈ హుస్సేన్ భాష అన్నారు. శుక్రవారం ఎల్లెల్సీ కాలువకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఉద్యమంలా మొక్కలు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లెల్సీ ఏఈలు దుర్గాప్రసాద్, మహేష్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

పత్తికొండ టౌన్, జూలై 5: పార్లమెంటు వేదికగా విద్వేషపూరితమైన ప్రసంగాలు చేసిన కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ హిందూ సమాజానికి, ప్రధాని నరేంద్ర మోదీకి క్షమాపణ చెప్పాలని బీజేపీ అసెంబ్లీ మండల కోకన్వీనర్ గోవర్ధన్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో బీజేపీ, ప్రధాని మోదీపైన అక్కసు వెళ్లగక్కడం మినహాయించి ప్రజా సమస్యలపై ఏ మాత్రం శ్రద్ధ చూపకుండా విపక్షనేత రాహుల్ గాంధీ హిందూ సమాజంపై విద్వేష ప్రసంగాలు చేయడం వంటివి మానుకోవాలన్నారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు శంకరయ్య, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి బ్రహ్మయ్య, నాయకులు రామాంజనేయులు, మల్లికార్జున, కరణం నరేష్, ఏబీవీపీ నాయకులు సోమన్న, గోరంట్లప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాల రథంపై విహరించిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 5: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై విహరించారు. శుక్రవారం అమావాస్య పర్వ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో అర్చకులు బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాఘవరాయుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి స్వర్ణ కవచంతో చూడముచ్చటగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.